# మినీకథ



## కలెక్షన్

అరవై ఆరోసారి అద్దంలో తన అందాన్ని సరి చూసుకుంది మాలతి.

ఆ రోజు తనూ, విజయ సినిమా కెళదామనుకున్నారు. సాయంత్రం ఐదింటికల్లా హాలుదగ్గర కలుస్తానని విజయతో చెప్పింది. అప్పుడే నాలుగయింది. ఇంకా అలంకరణే పూర్తికాలేదు.

"ఓసేవ్! ఇంకా అవలేదటే నీ ముస్తాబు. అవతల విజయ ఎదురు చూస్తూ ఉంటుందేమోనే త్వరగా వెళ్ళు" అంటూ కూతురిని హెచ్చరించింది పార్వతమ్మగారు.

"అయిపోయిందమ్మా.. వెళుతున్నా."

అంటూ కట్టుకున్న అమెరికన్ జార్జెట్ చీరను ఆఖరిసారి సవరించుకుని, అసంతృప్తిగానే అద్దంముందు నుంచి కదిలింది.

పర్సు తీసుకుని, దానిలో డబ్బు చూసుకుంది. చిల్లర అసలు లేదు.

"అమ్మా చిల్లర డబ్బులివ్వే బస్సుకావాలి"

వంటింట్లో తల్లికి వినపడేలా అరిచింది మాలతి.

"నా దగ్గరా ఎక్కువ లేవు.... ఇదుగో, ఈ రెండు రూపాయల చిల్లర వుంచుకుని.... జాగ్రత్తగా ఖర్చుచేయి" అంటూ కొన్ని పదిపైసలు, పావలా, అర్థరూపాయి కాసులు తెచ్చిచ్చింది పార్వతమ్మగారు.

వాటిని పర్సులో వేసుకుని, బస్సు స్టాండువైపు వడివడిగా అడుగులు వేసింది. ఇందాక అద్దం ముందు అంతసేపు నుంచున్నపుడు లేని తొందరంతా.... ఒక్కసారిగా ఇప్పుడామె అడుగుల్లో కనపడుతోంది.

అల్లంత దూరంలో.... నిండు గర్భిణిలా నీరసంగా వస్తున్న బస్సుని చూసి, ఎక్కువసేపు ఎదురు చూడవలసిన బాధ తప్పినందుకు సంతోషించింది.

బస్‌లో కూర్చోటానికి సీట్ దొరకలేదు.

'పోన్లే బస్సు దొరికింది అదే చాలు' అనుకుని సంతృప్తిపడి, పైన రాడ్ పట్టుకు నుంచుని బస్సంతా ఒక్కసారి కలియజూసింది. మగ చూపులన్నీ తన్నే శల్య పరీక్ష చేయడం గమనించి ఇబ్బందిగా ఫీల్ అయింది.

"పాడు మగాళ్ళు. ఆడపురుగు కనపడితే చాలు. కళ్ళు పత్తికాయలంత చేసుకుని మరీ చూస్తారు" స్వగతంలో అనుకుంది.

మరి తనింత కష్టపడి మేకప్ చేసుకొచ్చింది ఎవరి కోసం?

'ఏమో?' అదాలోచించ లేదామె.

తను దిగాల్సిన స్టేజి వచ్చేస్తోంది. కాని కండక్టర్ యింతవరకూ కనిపించలేదు. ఇష్టం లేకపోయినా....మళ్ళీ వెనక్కితిరిగి బస్సు కలియచూడడం తప్పలేదు.

మగ చూపులన్నీ .... వేటికవి....ఆమె తనకోసమే చూస్తోందనుకుని.... మురిసిపోయి....ఒళ్ళు మరిచిపోయి .... స్టైల్‌గా నవ్వుతున్నామనుకుని.... వెకిలిగా నవ్వేస్తున్నాయి.

స్టేజి దగ్గర పడింది. కండక్టర్ దగ్గర కొచ్చాడు.

"టిక్ కైట్ ప్లీజ్."

కళ్ళలోకి చూస్తూ ప్రేమగా అడిగాడు.

"ఛీ సెన్స్‌లెస్ బ్రూట్" – తిట్టుకుని, అంతకంటె ఏమీ చేయలేక, డబ్బులకోసం విసురుగా పర్సు తెరిచింది.

ఆ విసురికి, చేతిలోని పర్సు క్రిందపడి దానిలోని చిల్లరంతా బస్సులో తలోమూలా పడిపోయింది.

అసలే కోపంగా ఉంది- అందులో స్టేజి దగ్గరపడిందని కంగారు. ఆ కంగారులోనే కంగారుగా క్రిందపడ్డ చిల్లర వెతుక్కొని ఏరుకోసాగింది.

"ఇదిగో మిస్! ఇక్కడో పావలా పడింది" ఆప్యాయంగా చేతికి అందించాడో జులపాలహీరో

"ఏమండోయ్.... ఇక్కడో అర్థరూపాయుంది...."

అంటూ అదేదో సైంటిఫిక్ ఫార్ములా కనుగొన్న శాస్త్రజ్ఞుడిలా పోజెట్టి అందించాడో సుబ్బారావు.

"ఇక్కడో పావలా పడిందండి...."

"ఈ సీటుక్రింద పదిపైసలు...."

ఇలా.... బస్సులో ఇందాక తనను వెకిలిగా చూసిన మగచూపుల సహాయంతో.. క్రిందపడ్డ చిల్లర ఏరుకుని, స్టేజి రావడంతో హడావుడిగా దిగిపోయింది. (పావం! ఆ హడావుడిలో టికెట్ తీసుకోనే లేదు)

"అమ్మిచ్చిన రెండు రూపాయల్లో ఎంత చిల్లర పోయిందో!" అనుకుని.... చేతిలో పట్టుకున్న చిల్లరడబ్బులు లెక్కపెట్టుకుంది.

"ఆశ్చర్యం.... అంతా కలిపి ఐదు రూపాయలుంది!!"

—ముళ్ళపూడి శేషుకుమార్

